ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4 ఆగస్టు 2001

# మూ'రణా'రుణం

నిజమే.... నిజమే.... స్థావరజంగమాలన్నింటికీ ఈ యుద్ధం తప్పదు.... వైయక్తికరణాలు సాగించవలసిందే.

ఈ యుద్ధాలకి అందరూ బాకీ పడ్డవాళ్లే. యుద్ధ ఋణాల్ని గాయాల ద్వారానే కదా తీర్చుకోవాలి తప్పదు.

చేతనైనన్ని గాయాల్ని చెల్లించి యుద్ధఋణాన్ని చెల్లు చేసుకునే ప్రయత్నంలో ఎవరి లోకాలను వాళ్లు మోసుకుంటూ.... ఎవరి యుద్ధాలు వాళ్లు చేసుకుంటూ.... మళ్లీ ఓసామూహిక యుద్ధానికి సిద్ధమే మనమందరం... నిజం..... నిజం!

నేనూ, సవ్యసాచీ, విశ్వప్రేమికుడూ ఆకాశాన్ని పరచుకుని చుక్కలు పొదిగిన స్వర్ణ జలకలశాన్ని మధ్యలో పెట్టుకుని కూచునున్నాం.

"సవ్యసాచి యుద్ధరంగం నుంచీ ఇంత త్వరగా బయటికి రావడం ఈ మధ్య ఇదేనేమో!" విశ్వ ప్రేమికుడు స్వర్ణకలశాన్ని మేఘాలముక్కతో తుడుస్తూ అన్నాడు.

"మరీ పెద్ద యుద్ధమేమీ కాదు లే...సగం యుద్ధాన్ని మాధవీ మనోహరుడే పూర్తి చేశాడు. మొదటి ఆయుధమూ ఆఖరి కట్టే నాది. మాధవీ మనోహరుడు కూడా నా తోటే రావాల్సింది. ఇంటికెళ్లి ప్రణయినితో కూడా వాగ్యుద్ధాన్నీ పూర్తిచేసుకొచ్చేస్తానని అలాగే రంగం నుంచే నిష్క్రమించాడు. లైక్లీ టు డ్రాసినటెనీ మోమెంట్" వాడలా వాక్యాన్ని ఆపాడో లేదో మెత్తటి శబ్దం చేస్తూ వచ్చి ఆగిందో తెల్లటి పూలరథం.

అందులోంచీ కవచంతో శిరస్త్రాణంతో తూణీరంతోటీ భుజ కీర్తులూ కత్తీడాలూ నానాయుద్ధ సరంజామాతోటి దిగాడు – మాధవీ మనోహరుడు. యావద్విశ్వాన్నీ మోస్తూమెల్లిగా మా వేపు కదిలి వచ్చాడు. రాంగానే కవచాలూ శిరస్త్రాణం తూణీరం కత్తీడాలూ భుజకీర్తులా నానా విలువల వలువలూ విడిచేసి ఓ తుపానులాంటి నిట్టూర్పు విడిచి...."మిత్రప్రియజనులారా! కనుడు కనుడు మధ్యాన్హతన మ్యాటిసు సుందర

స్యందనమును" అతని వేషం మారిపోయింది. రూపంమారిపోయింది. "బ్యూటిఫుల్!" అన్నాన్నేను.

మేం పరచుకున్న ఆకాశం అంచుమీద భారీకాయాన్ని మోపి "అచ్యుతుడు రాలేదేమి?" అనడిగాడు మాధవీమనోహరుడు.

"అన్నార్తుల గోడు చాలా ఎక్కువగా ఉందీ కొద్దిగా ఆలస్యమవుతుందన్నాడు నువ్వలాగే కదా వచ్చావు అమరావతి హోటెల్ముందు జనాలగుంపు చూళ్లేదా?" సవ్యసాచన్నాడు.

"అవునవును సిఎం మీటింగదా.... లారీల్లో కంకరతెచ్చేసినట్లుగా కుమ్మరించారు జనాల్ని తీసుకొచ్చి. వాళ్లతో చాలామందికి అచ్యుతుడి గుడి ప్రసాదాలే కదా" విశ్వప్రేమికుడు అన్నాడు. ఈలోగా టోగా విప్పేసి ప్యాంటూ షర్టూ వేసుకుని అరిస్టాటిలొచ్చాడు మోటార్సైకిల్మీద... అరిస్టాటిల్వెనక దీర్ఘ పాదుడు కూడా దిగాడు.

* * *

ఇక చీకటి ఆకాశం లోహితవర్ణంలోకి మారడం మొదలైంది. అక్కడక్కడా అతుక్కున్న చుక్కల్ని పీకేసి మా కళ్లలో పొదుక్కున్నాం. ఈ నిముషం వ్యవధిలో విశ్వప్రేమికుడు ప్లాస్టిక్ స్పూన్తోటి వెన్నెల్ని తింటూ మమ్మల్ని చూసి "సర్వేజనాః సుఖినోభవంతు" అన్నాడు.

మా అందరికీ కల్పి పరచిన పాత ఆకాశం సరిపోలేదు. ఎవరి లోకాలను వారే మోసుకు తిరిగేవాళ్లం కాబట్టి మా సొంత ఆకాశాల కొరత మాకు లేదు. ఒక్కోడూ ఒక్కో మబ్బును విదిల్చి కూచున్నాడు.

వెన్నెల్ని తింటోన్న ప్లాస్టిక్ స్పూన్ని చూస్తూ విశ్వప్రేమికుడంటున్నాడు – "ఇది మోసేంత రుచి ఇసుమంత కూడా దీనికి తగల్దు. పాపపుణ్యాలకు అతీతమైన యోగి ఈ ప్లాస్టిక్ స్పూన్".

"అచ్యుతుడికి కూడా వేసేయండి వచ్చేస్తాడు" అన్నాడరిస్టాటిల్. జేబులోంచి చించేసినటోగా ముక్కతో బట్టతల తుడుచుకుంటూ.

తల పగిలి తల్లడిల్లిన స్వర్ణకలశం బాధనారున్నొక్క ముఖాల శూన్యతలోకి పంచి వంచేసి వలికించేసింది.

శూన్యమైన కలశం చుక్కల్లో కెగిరిపోయింది.

"ప్రోస్ట్" అన్నాన్నేను మిగిలిన ఆరుముఖాల శూన్యఖేదాల్ని తాకే ప్రయత్నంలో.

చిట్లిన స్ఫటికమృదుశబ్దమ్మీదుగా సిల్కు ద్రవం జాలువారింది.

మామా యుద్ధాల బాకీ గాయాలకు

మేమందరం సామూహికంగా చేసుకుంటూన్న వైద్యం.

కాసేపుంటే సవ్యసాచి పరిమళించే పాట మల్హార్ రాస్తాడు.

కారు నలుపునించీ లోహిత వర్ణానికి మారిన ఆకాశం మా కోసం మృదు నీలిమ సంతరించుకుంటుంది.

అచ్యుతుడు ఆయాసపడుతూ వచ్చాడు. అతన్తో పాటింకో ప్రాణి. పరికించి చూస్తే ఏదో గ్రహాంతర వాసిలా ఉన్నాడు.

"ఫిలిప్ మాథ్యూస్ ఊళ్లో ఫ్యాక్టరీ ఇన్ఛార్జి. ఏవో సంతకాల కోసం వచ్చాడు" మా నిశ్శబ్ద ప్రకటితకుతూహలానికి సమాధానమిచ్చాడు అచ్యుతుడు.

"హి....హి....హి..." అంటూ హయహేషలాంటి శబ్దాన్ని 'నవ్వు' చీటీతో మాకందరికీ ఇచ్చాడా గ్రహాంతరవాసి.

దూరంగా ట్రెయిన్ విజిల్. బ్యాంగ్లూరెక్స్ ప్రెస్.

"ఆహా ధైవతం. చతుశ్శ్రుతిధైవతవం. వినండి వినండి. బాగా వినండి గ....ప....ధా...ధా.......వూం ఈ శ్రుతిలో లేదు. వలజి... అదే అదే కళావతి.

సగపధనిసా...." ట్రెయిన్ విజిల్ని తన స్వరంలోకి తాపడం చేసుకుని సవ్యసాచి కళావతి అందుకున్నాడు.

"కోయీ సాగర్.... దిల్ కో బహలాతా నహీం... అది అదే రాగమేనా?" మాధవీమనోహరుడడిగాడు.

ఆకాశపు మృదునీలిమ లోంచి ముంచితీసిన మామిడిచివుళ్ళు...

కరెన్సీ కాగితాలైపోయినసంగీత సాహిత్యాలూ, శిల్పకళాదులూ అన్నీ అన్నీ రూపాలు మార్చేసుకు మా చుట్టూ చేరిపోయాయి.

"ఆ కాహళ దేహభాగ మిటు విసిరేయ్. ఆహాం కాహళమా! మరణించియూ యెంత మధురముగ నుంటివే?!" అంటూ "కోళ్ళీ కోడ్ కోళి" కాలిముక్కను చీకుతూ దాన్నా ఆకారానికి తెచ్చిన 'కేరళా క్విజీన్కింగ్' గోపాల్ నాయర్కి పరోక్షంగా సెల్యూట్ చేశాడు మాధవీమనోహరుడు.

నేను ఖాళీ అయిన నా గ్లాసునీ, అరిస్టాటిలు గ్లాసునీ తీసి ఒక దాంతో ఒకటి మీటుతూ అందరినీ ఆకర్షించి... "ఓ మాధవీ మనోహరా! సవ్యసాచీ! విశ్వ ప్రేమికా! అచ్యుతా! దీర్ఘపాదా! బ్యాకస్ యీజ్ గెటింగ్యాంగ్రీ... లైబేషన్ అండ్ అబ్లేషన్ హ్యావ్ స్టాప్డ్" అనీ అరిచాను.

"అప్పుడే అయిపోయిందా? సరుకు మహిమ సార్! సూపర్ స్టఫ్" దీర్ఘ పాదు డన్నాడు.

అందరూ కోరస్‌లో "జయజయరాం... జానకిరాం... రాం..రాం.. జయరాం..... రాం.....రాం....... జయరాం" అని పాటందుకున్నాం.

నీలం ప్యాంటూ, తెల్లచొక్కాతో కోదండరహితుడూ,కోమలాంగుడూకాని మాధవీ మనోహరుని సరికొత్త మ్యాటిజ్ చోదకుడు జయరాముడు వచ్చి ఓ చేయి నడ్డి వెనకా, ఇంకో చేయి బట్టతల వెనకా ఉంచుకుని "సార్?" అన్నాడు విధేయతా భక్తులతో...

"బ్యాక్సీట్లో ఉన్న క్యారీ బ్యాగందుకో" అన్నాడు మాధవీ మనోహరుడు.

ఇంకో స్వర్ణకలశం తలతెగితపతపా తన్ను కుంది. అదృశ్య బ్యాకప్ 'స్వాహా' అని శాంతించాడు.

మొత్తానికి రెండు కలశాల అభిషేకం.

మూడు కుక్కుటాల నైవేద్యంతో బ్యాకస్ ఆరాధన ముగిసింది.

ఆఖరి ధూపాలు వెలిగాయి.

తాను పర్చుకున్న ఆకాశాన్ని మామిడిచెట్టు మొదలుకి లాక్కుని దానికానుకుని కూచుని సవ్యసాచి ధూపాన్ని ఆస్వాదిస్తూ 'కుఛ్ తో లోగ్ కహేంగే' ఆలపిస్తున్నాడు.

అందరం ప్రమీలంగా మామా సప్తవర్ణ లోకార్ణవాల్లో ఈతకొడుతూ తేలియాడుతో... ఉన్నట్టుండి "అమ్మా!" అన్న రెండు కేకలు ఒకే మాటు వినిపించాయి.

ఒకటి, పాటను చప్పరిస్తోన్న సవ్యసాచి గొంతులోంచీ ఆ పాటను నిలువునా చించి వెలువడింది.

మరొకటి వనాంతర సీమ నించీ..

ఏమిటి? ఏమైందని సవ్యసాచిని సమీపించారందరూ.

అరిస్టాటిలు నవ్వుతూ "మామిడిచెట్టుకు గండుచీమల దండు కదా.సవ్యసాచి పాటను తిందామని గొంతు పెరికి వుంటాయి" అన్నాడు.

"మరి రెండో 'అమ్మా?" అన్నాన్నేను.

నా ప్రశ్నకు సమాధానమన్నట్టు తోటమాలి పరిగెత్తుకుంటూ మాదగ్గరికొచ్చాడు - "దేవరా పురుక్కుట్టింది దేవరా!" అంటూ మాధవీమనోహరుడికి తన కాలు చూపించాడు.

"జయరాం, కారు హెడ్‌లైట్స్ వెయ్యి" అని ఆ కాంతిలో తోటమాలి కాలు చూడసాగాడు.

మాధవీ మనోహరుడు పూర్వరూపం ధరిస్తున్నాడు. కిరీటం శిరస్త్రాణం అదుగో కవచం కాసేపటి వరకూ ఆ వేషంలో ఆ రూపంలోనే ఉన్నాడు. చినచిన్నగా మళ్ళీ ప్రస్తుత రూపంలోకి పరిణమించసాగాడు. "విషం లేని పురుగులేరా. ఏం కాదు పో" అని తోటమాటిలతో అని ఆఖరి భుజకీర్తిని కూడా విడిచేశాడు.

అరిస్టాటిలు గంబోరో సోకిన ఫాం కోడిలా ఉన్నాడు.

దీర్ఘపాదుడు మిడిగుడ్లతో ఊరి ముందు విగ్రహంలా.

విశ్వప్రేమికుడో 'సై ఆఫ్ రిలీఫ్' ఎగరేశాడు, సవ్యసాచి.... పాటకూ, చీమకాటుకీ మధ్య పయనిస్తూ....

అచ్యుతుడు తోటమాలిని కుట్టిన పురుగు గురించి మాధవీ మనోహరుడితో ఇన్‌క్వైరీ చేస్తున్నాడు.

అచ్యుతుడితో వచ్చిన గ్రహాంతరవాసి తన పునః విశ్వాంతరయానధ్యాసతో ఉన్నట్టున్నాడు. నేను సవ్యసాచిని. చీమకాటు మంటనించీ స్వరమూర్ఛనల చురుకు జాగ్రత్తలోకి రమ్మని లోగొంతుకతో వేడుకుంటూ.....

మాధవీ మనోహరుడు తన బరువుతో భూమ్యాకర్షణశక్తిని కొలుస్తున్నాడు.

ఇంతట్లో

జగన్నాథగట్టు వెనక ఓ మెరుపు మెరిసింది. ఆ కొండ దండిగా ధైర్యంతో వజ్రాన్ని మోసింది ఫెళ్లుమని ప్రాదిని విచ్చిపోయింది. చీకట్లో ఆ మెరపు వెలుగుకు ప్రతిస్పందనగా అక్కడ అందరి ముఖాలూ ఓ లిప్తపాటువెలిగి ఆరిపోయాయి. ఆ క్షణంలో అందరి ముఖాల్లో నా ముఖాన్ని కొద్ది కొద్దిగా, మనిషి ముఖాన్ని ఇంకొద్దిగా వెతుకుతూ నేననుకున్నాను- నిజమే. ...నిజమే... ఇక్కడ్నించీ కదిలింతర్వాత మామా యుద్ధాలు మేం చేసుకుంటూ ఉండవలసిందే.

* * *

ఈ యుద్ధాలకి అందరం బాకీ పడ్డవాళ్లమే. యుద్ధఋణాల్ని గాయాల ద్వారానే కదా తీర్చుకోవాలి. తప్పదు. చేతనైనన్ని గాయాల్నిచెల్లిస్తూ యుద్ధ ఋణాల్ని చెల్లువేసుకునే యత్నంలో ఎవరి లోకాలను వాళ్లు మోస్తూ......

ఎవరి యుద్ధాలు వాళ్లు చేసుకుంటూ....

మళ్లీ ఎప్పుడో ఓ సామూహిక యుద్ధానికి సిద్ధమే మనమందరం నిజం..... నిజం...